# నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

మంగళవారం
11 ఆగస్టు 2026


## గోపాలపురం - దమ్మపేట రహదారిపై

# మృత్యు మలుపు



**ప్రమాదకర మలుపు వద్ద**

**కరవైన హెచ్చరిక బోర్డులు**

**రాత్రి వేళల్లో తీవ్ర అంధకారం**

**పెను ప్రమాదాలకు పొంచి ఉన్న ముప్పు**

**నిద్రావస్థలో సంబంధిత అధికారులు**

**దమ్మపేట, ఆగష్టు 10(నినాదం):**

గోపాలపురం నుండి దమ్మపేట వెళ్లే ప్రధాన పాల్వంచ రహదారి నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉండే మార్గం కానీ, ప్రస్తుతం ఈ రహదారి వాహనదారుల పాలిట 'మృత్యు పాశం'లా మారింది. ముఖ్యంగా ఈ మార్గంలో ఉన్న అత్యంత ప్రమాదకరమైన మూలమలుపు వద్ద పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. ఎదురుగా వచ్చే వాహనం ఏమాత్రం కనిపించని ప్రమాదకరమైన ఆ మలుపుపై ప్రయాణించాలంటేనే జనం వణికిపోతున్నారు. ఇంతటి ప్రమాదకర స్థితి కళ్లముందే కనిపిస్తున్నా.. సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు మాత్రం 'నిమ్మకు నీరెత్తినట్లు' వ్యవహరిస్తుండటంపై స్థానికంగా తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.



మలుపు తిరిగే చోటే వాహనదారులకు ఈ మూలమలుపు ఒక ఎత్తుపల్లాల మలుపులా ఉంది. అంతే కాకుండా దట్టమైన పొదలతో కమ్మయడంతో దూరం నుండి వేగంగా వచ్చే వాహనదారులకు అవతలి వైపు నుండి వచ్చే లారీలు, బస్సులు లేదా ద్విచక్ర వాహనాలు అస్సలు కనిపించవు. దీనికి తోడు, అత్యంత ప్రమాదకరమైన ఈ మూలమలుపు మలుపు తిరిగే ప్రధాన కేంద్రంలోనే రహదారిపై వాహనదారులను బలితీసుకునేలా పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు మధ్య భాగం పూర్తిగా దెబ్బతిని మోకాళ్ల లోతున గోతులు పడ్డాయి. వాహనాలు మలుపు తిరిగే ఆ క్లిష్ట సమయంలోనే ఈ పెద్ద గుంతలు అడ్డురావడంతో, నడిపేవారు అప్రమత్తం కాలేకపోతున్నారు. ఆ గుంతలను తప్పించే క్రమంలో వాహనాలు అదుపుతప్పి పక్కనే ఉన్న లోయల్లోకి, పొలాల్లోకి దూసుకెళ్లే ప్రమాదం ఉంది. వర్షపు నీరు చేరి కంటికి కనబడకుండా ఉండే ఈ లోతైన గోతుల వల్ల ద్విచక్ర వాహనదారులు నిత్యం అల్లాడిపోతున్నారు. సాధారణ రోజుల్లోనే కాకుండా వర్షాకాలంలో ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది.

**సూచిక బోర్డుల్లేవు.. రక్షణ కరవు.. నిత్యం తృటిలో తప్పుతున్న ప్రమాదాలు!**

ఇలాంటి అత్యంత సున్నితమైన ప్రమాదకర మలుపుల వద్ద రోడ్డు రక్షణ నిబంధనల ప్రకారం.. కనీసం అర కిలోమీటరు ముందే 'ప్రమాదకర ప్రాంతం' లేదా 'వేగాన్ని తగ్గించండి' వంటి ప్రకాశవంతమైన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. కానీ ఇక్కడ కనుచూపు మేరలో ఒక్క సూచిక బోర్డు కూడా లేదు. అలాగే రోడ్డు అంచున ఎలాంటి రక్షణ గోడ కానీ, రాత్రి వేళల్లో మలుపును సూచించే ప్రకాశవంతమైన ప్రతిబింబకాలు కానీ లేకపోవడం అధికారుల ఘోర నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. కొత్తగా ఈ మార్గంలో ప్రయాణించే వారు ఇక్కడి మలుపును, పెద్ద గుంతలను గమనించలేక నేరుగా ప్రమాదాల బారిన పడుతున్నారు.

**నిధులు ఉన్నా నిర్లక్ష్యమేనా..?వాహనదారుల ఆవేదన**

ఒకవైపు నియోజకవర్గంలో కోట్ల రూపాయల నిధులతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని సంబరాలు చేసుకుంటుంటే, మరోవైపు ప్రతిరోజూ ప్రజలు ప్రాణాలు పణంగా పెట్టి ప్రయాణించే ఇలాంటి ప్రధాన రహదారులను అధికారులు విస్మరించడం వెనుక ఉన్న అంతరార్థం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. చిన్నపాటి మరమ్మతులు, ఈ పెద్ద గుంతలను పూడ్చడానికి కూడా రహదారులు, భవనాల శాఖ అధికారులకు మనసు రావడం లేదని వాహనదారులు మండిపడుతున్నారు.

**ప్రమాదాలు జరగకముందే స్పందించండి**

ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి, అమాయకుల ప్రాణాలు గాల్లో కలిశాకే చర్యలు చేపడతారా అని వాహనదారులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు నిద్రమత్తు వీడి, అలాగే స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని యుద్ధప్రాతిపదికన స్పందించాలని కోరుతున్నారు. దమ్మపేట – గోపాలపురం రహదారిలోని ఈ 'మృత్యు మలుపు' వద్ద ఏర్పడిన పెద్ద గుంతలను వెంటనే పూడ్చడంతో పాటు, వేగ నిరోధకాలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.



## రైతన్నల సంక్షేమం కోసం నాగార్జునసాగర్‌లో

# మహా వరుణ యాగం

### మహా వరుణ యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్

**వైరా, ఆగస్టు 10, (నినాదం)**

వైరా నియోజకవర్గ రైతాంగం సుభిక్షంగా ఉండాలని, జిల్లాలోని అన్ని ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు వర్షాలతో నిండాలని, పంటలకు సమృద్ధిగా సాగునీరు లభించి రైతన్నల కుటుంబాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ మహా వరుణ యాగంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతన్న సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రకృతి కరుణించి తెలంగాణ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రతి ప్రాజెక్టు, చెరువు, కుంట నిండాలని, ప్రతి ఎకరాకు సాగునీరు అందాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతోందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మరియు వైరా నియోజకవర్గ ప్రతి ప్రాజెక్టు, చెరువు, కుంట నిండి రైతులకు సాగునీరు పుష్కలంగా అందాలని, పంటలు సమృద్ధిగా పండాలని, రైతన్నల కుటుంబాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని మహా వరుణ యాగం సందర్భంగా వరుణ దేవుడికి ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నామన్నారు.



## జై కేసీఆర్ జై కాంగ్రెస్ నినాదాలతో సభలో గందరగోళం

### కౌశిక్‌రెడ్డికి కౌంటర్ ఇచ్చిన మంత్రులు పొన్నం, పొంగులేటి

**కమలాపూర్,ఆగస్టు 10 (నినాదం)**

మండల కేంద్రంలో రాష్ట్ర మంత్రుల పర్యటన సందర్భంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో గందరగోళం నెలకొంది. మండలంలోని గూడూరు,కమలాపూర్ మరిపల్లిగూడెం, గ్రామాల్లో గత ప్రభుత్వం హయాంలో నిర్మించిన 402 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవంతో పాటు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. అనంతరం మండల కేంద్రంలో లబ్దిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేయడం సంతోషకరమని అన్నారు. దీంతో సభలో ఒక్కసారిగా జై కేసీఆర్, జై కాంగ్రెస్ నినాదాలు మార్మోగాయి. వెంటనే మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ స్పందించారు. కేసీఆర్ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాన్ని గాలికి వదిలేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వాటిని పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామని కౌశిక్‌రెడ్డికి కౌంటర్ ఇచ్చారు.అయినప్పటికీ సభలో కార్యకర్తలు జై కేసీఆర్, జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేయడంతో కొంతసేపు సమావేశంలో గందరగోళ పరిస్థితి నెలకొంది.దింతో పోలీసులు రంగ ప్రవేశం చేసి టి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలను బయటికి పంపించారు. దింతో పలువురు లబ్దిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు.



## కోహెడలో అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

**కోహెడ, ఆగస్టు 10 (నినాదం) :**

కోహెడ మండలంలోని చొక్కారావు ఓపెన్ ఫ్లాట్‌లోని గుడిసెల్లో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు సోమవారం పోలీసులు మెరుపు దాడులు నిర్వహించి బియ్యం నిల్వలను గుర్తించారు.ఈ ఘటనకు సంబంధించి నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసినా, తరలించినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని, జైలు శిక్ష కూడా తప్పదని ఎస్ఐ పి. అభిలాష్ హెచ్చరించారు. అక్రమ రేషన్ బియ్యం రవాణాపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని తెలిపారు.

## ఆర్థిక సాయం అందజేత

**వలిగొండ, ఆగస్టు 10 (నినాదం):**



మండలంలోని పహిల్వాన్ పురం గ్రామానికి చెందిన వనగంటి స్వామి అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందగా ఆ కుటుంబానికి ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి సహకారంతో 5వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏజేఆర్ టీం సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


# దొడ్లపహాడ్ వీరనాగమ్మ ఆలయ అభివృద్ధికి రూ.1.80 లక్షల విరాళం

**ఆమనగల్లు, ఆగస్టు 10(నినాదం):**

మాడుగుల మండలం దొడ్లపహాడ్ గ్రామంలో నూతనంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూర్తిచేసుకున్న వీరనాగమ్మ దేవత ఆలయంలో 41 రోజుల పూజా కార్యక్రమాల ముగింపు సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారంగా రూ.1,80,000 వ్యయంతో పెయింటింగ్ పనులు పూర్తి చేయించారు.ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఆలయాలు ప్రజల



విశ్వాసాలు, సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని,గ్రామాల్లో ఆలయాల అభివృద్ధి కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకు మాత్రమే కాకుండా,గ్రామ ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు



నాగమ్మ దేవత ఆలయంలో నిర్వహించిన మండల పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందడం ఎంతో ఆనందంగా ఉందని, దొడ్లపహాడ్ గ్రామ ప్రజలకు నాగమ్మ దేవత అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు.ఈ



కార్యక్రమంలో..ఆలయ కమిటీ సభ్యులు మట్ట నాగయ్య మట్ట యాదయ్య, అర్జున్,మల్లేష్,శ్రీను.మల్లేష్, శంకర్, రాజు, నాగరాజు,వెంకటేష్,నాగరాజు, సురేష్,సత్తయ్య,యాదగిరి,నాగేష్ లతో పాటు గ్రామస్తులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

### బిషప్ దుర్గం ప్రభాకర్

**సూర్యాపేట ప్రతినిధి ఆగస్టు 10 (నినాదం)**



దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి క్రైస్తవ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1950 ఆగస్టు 10న భారతదేశపు మొదటి రాష్ట్రపతి డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ షెడ్యూల్ కులాలు కొత్త రూపాయి సంతకం చేసి ఎస్సీ హోదాను ప్రత్యేకంగా హిందువులకు మాత్రమే పరిమితం చేసిందని పేరా3 మినహాయింపు హిందూ మతమే కాకుండా వేరే మతాన్ని అనుసరించి ఏ వ్యక్తి అయినా సభ్యునిగా పరిగణించబడతారని గుర్తు చేశారు.భారతదేశవ్యాప్తంగా ఉన్న క్రైస్తవ సంఘాలు సంస్థల పేరా 3 రద్దు చేయాలని కుల ఆధారిత రిజర్వేషన్లు మత వివక్షను అంతం చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 10వ తేదీని బ్లాక్ డేగా జాతీయ నిరసన దినంగా పాటిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిషప్ సిహెచ్ సాల్మన్ రాజు రెబ సాంసంగ్ మామిడి జాన్ మార్క్ ఎం హాజరియా జవహర్ పాల్ బ్రదర్ మీసాల ప్రభుదాసు బిషప్ గడ్డం డేవిడ్ రాజు బ్రదర్, జాటోతు డేవిడ్ రాజు సుధాకర్ జలగం జేమ్స్ పరంజ్యోతి రూబెన్ బాలాజీ నాయక్ రాజబాబు సిహెచ్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ నాగరాజుకు

# హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి

**పదోన్నతితో మరింత బాధ్యతగా విధులు నిర్వహించాలి - ఎస్ఐ వెంకటేష్ గౌడ్**

**నాగరాజును ఘనంగా సన్మానించిన పెబ్బేరు పోలీసు సిబ్బంది**

**పెబ్బేరు, ఆగస్టు 10 (నినాదం) :**

తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖలో భాగంగా పెబ్బేరు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్'గా విధులు నిర్వర్తిస్తున్న నాగరాజుకు హెడ్ కానిస్టేబుల్'గా పదోన్నతి లభించింది. వనపర్తి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చేపట్టిన పదోన్నతుల ప్రక్రియలో భాగంగా ఆయనకు ఈ పదోన్నతి కల్పించారు. పదోన్నతి పొందిన నాగరాజును పెబ్బేరు ఎస్ఐ వెంకటేష్ గౌడ్ అభినందించారు. హెడ్ కానిస్టేబుల్'గా మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ పదోన్నతితో తనపై మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు విధులు సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజల సహకారంతో సేవలందిస్తానని పేర్కొన్నారు. అనంతరం పెబ్బేరు పోలీస్‌స్టేషన్'లో



పోలీసు సిబ్బంది నాగరాజును ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్సై శ్రీనివాస్ గౌడ్, హెడ్ కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్ రెడ్డి, ఆంజనేయులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## మోడీవి కార్మిక, కర్షక

# ప్రజావ్యతిరేక విధానాలు

**రాజ్యాంగ స్పూర్తిని నీరు గారుస్తున్న కేంద్ర ప్రభుత్వం**

**క్విట్ ఇండియా ఉద్యమ స్పూర్తితో బిజెపి విధానాలపై పోరాటాలు**

**సిఐటియు ఆధ్వర్యంలో భారీ నిరసన ధర్నా రాస్తారోకో**

**అమీన్ పూర్, ఆగస్ట్ 10,(నినాదం ):**

కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని,రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని,గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని సిఐటియు,రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపులో భాగంగా సోమవారం నాడు అమీన్ పూర్ మండలంలోని బీరంగూడ లో భారీ ర్యాలీ నిర్వహించి,ఎమ్మార్వో కార్యాలయం వద్ద ధర్నా చేసి,రాస్తారోకో చేయడం జరిగింది.ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు పాండురంగారెడ్డి, సిఐటియు జిల్లా నాయకులు నర్సింహారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్మికులు కర్షకులు ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వారి సమస్యల పరిష్కారంలో మోడీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.దేశంలోని ప్రజల సమస్యలను పట్టించుకోకుండా అదాని, అంబానీ,బడా పెట్టుబడిదారులకు సేవ చేస్తున్నారని అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన పోరాటాలు చేస్తుంటే నిర్బంధాలను ప్రయోగిస్తూ అణిచివేస్తున్నారని ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని హక్కులను కాలరాస్తున్నారని అన్నారు. అనేక పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను యజమానుల తొత్తులుగా మార్చి కార్మికులను బానిసలుగా చేశారని అన్నారు.రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని అనేక పోరాటాలు చేయడం జరిగిందని అన్నారు. గ్రామీణ పేదలకు పని కల్పించాలని ఉద్దేశంతో గత ప్రభుత్వం తెచ్చినటువంటి గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నీరు కార్చారని అన్నారు. నిత్యవసర సరుకుల ధరలు పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెద్ద ఎత్తున పెరుగుతున్న పట్టించుకోవడం లేదన్నారు. విద్యా ఉద్యోగాలు లేక యువత పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తుంటే వారి సమస్యలను సానుకూలంగా స్పందించకుండా దౌర్జన్యంగా పార్టీలతో కొట్టి కేసులు పెట్టి అణచివేస్తున్నారని అన్నారు. మోడీ విధానాల పట్ల విసిగిపోయిన ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేస్తున్నారని క్విట్ ఇండియా ఉద్యమస్పూర్తితో ఆ ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాయిని లలిత, సునీత, సిఐటియు నాయకులు జార్జ్, శ్రీనివాస్ రెడ్డి, ప్రదీప్, మణిరాజు,వీరస్వామి,జిలాని వివిధ పరిశ్రమల కార్మిక నాయకులు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం కార్మిక

# వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి




**వలిగొండ, ఆగస్టు 10 (నినాదం):**

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిర్పంగి స్వామి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వివిధ కార్మిక సంఘాల నాయకులతో కలిసి నిరసన తెలిపి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తుందని, ఎందరో పోరాట యోధుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న దేశ స్వాతంత్రాన్ని విదేశీ సంస్థలకు తాకట్టు పెడుతూ నయా ఉదారవాద సంస్కరణలు అమలు చేస్తుందన్నారు. నాటి స్వాతంత్ర కాలంలో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను ఉల్లంఘించి నూతన లేబర్ కోడ్లను ముందుకు తెచ్చిందని దీని ద్వారా కార్మిక హక్కులను హరించి వేస్తుందన్నారు. వెంటనే పార్లమెంట్ లో కనీస మద్దతు ధరల చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యవసాయ కార్మిక రైతు వ్యతిరేక బిల్లులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుర్కపెల్లి సురేందర్, కందాడి సత్తిరెడ్డి, కూర శ్రీనివాస్, కొండే కిష్టయ్య, దొడ్డి బిక్షపతి, కొండే నర్సింహ, జన్ని జంగయ్య, దుబ్బ లింగం, కవిడే సురేష్, గర్దాసు నర్సింహ, భీమనబోయిన జంగయ్య, కొండూరు సత్తయ్య, చేగూరి నగేష్, గూడూరు బుచ్చిరెడ్డి, వేముల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.